నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
బుధవారం | మార్చి 06, 2024 | www.navatelangana.com

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని పొన్న గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. గ్రామ పంచాయతీ నూతన భవనానికి, అంగన్వాడి భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు మెరుగైన పాలన అందించే విధంగా, నియోజక వర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే విధంగా, అందరం కలిసి ముందుకెళ్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీటీసీ సూర్యకాంత్, మండల నాయకులు తోకల చందు, లక్ష్మణ్, లతీఫ్, కో ఆప్షన్ సభ్యుడు మాణిక్‌రావ్ పాల్గొన్నారు.



మట్టి అక్రమ రవాణాను అరికట్టాలి

నవతెలంగాణ - జైపూర్

మండలంలోని ఇందారం, రామారావుపేట్ శివారు ప్రాంతాల నుండి తరలే మట్టి అక్రమ రవాణా అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఆర్డీఓ రాములుకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గతంలో కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అయినప్పటికీ మట్టి అక్రమ రవాణా కొనసాగుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన ఆర్డీఓ మైనింగ్ అధికారులతో మాట్లాడి రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవోను కలిసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫయాజుద్దీన్, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, చల్ల విశ్వంబర్‌రెడ్డి, సుంకర శ్రీనివాస్ ఉన్నారు.



ధరణి దరఖాస్తుల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-నిర్మల్

ధరణి దరఖాస్తుల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్మల్ రూరల్ మండలం కొట్ల(కె) గ్రామపంచాయతీ కార్యాలయంలో ధరణి పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో నిర్దేశిత సమయంలోగా ధరణి షెడ్యూల్స్ ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల వారీగా వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ బృందం దరఖాస్తుదారుల భూములను పరిశీలించి రికార్డులో ఉన్న వాటిని సరిపోల్చుకొని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యాలయ ప్రాంగణంలోని నర్సరీని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని పరిశీలించి, అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. కార్యాలయంలోని విభాగాలను పరిశీలించారు. పారదర్శకంగా ప్రజలకు సేవలందించాలని సూచించారు. కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ రాజు, తహసీల్దార్ సంతోష్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో 30 రోజుల కోర్సు ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు ఎస్ ఎసెన్షియల్ ఇంగ్లీష్ గ్రామర్ ఫర్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ అనే 30 రోజుల సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.శ్రీనివాస్ పాల్గొని ఈ కోర్సును ప్రారంభించి మాట్లాడారు. ఇందులో గ్రూప్-1, గ్రూప్-2, టెట్, ఎస్సై, ఎస్ఎస్‌సీ తదితర పోటీ పరీక్షలకు ఉపయోగపడే ఇంగ్లీష్ గ్రామర్‌ను 30 రోజులపాటు నేర్పడం జరుగుతుందని తెలిపారు. ఈ కోర్సు విద్యార్థులకు భవిష్యత్తులో రాయబోయే అన్ని రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జాకీర్ హుస్సేన్, కోర్స్ డైరెక్టర్ డి.దయాకర్, ఆంగ్ల అధ్యాపకులు బి.ఆనందం, భువనేశ్వరి, రాజ్‌కుమార్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని కిమ్స్ ఆసుపత్రిలో శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 30 మంది హాజరు కాగా వారిలో ఎనిమిది మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి వారి సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత దంపతులు తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ఇంటర్ పరీక్షకు 493 మంది గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం నిర్వహించిన సెకండియర్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ కుమార్ పేర్కొన్నారు. పరీక్షకు 9,490 మంది హాజరు కావాల్సి ఉండగా, 8997 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు తెలిపారు. 493 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు వెల్లడించారు.

ప్రజా పాలన సేవా కేంద్రాలు త్వరగా ప్రారంభించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దౌత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దౌత్రే, పక్కన అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ప్రజా పాలన సేవా కేంద్రాలను పూర్తిస్థాయి ఏర్పాట్లతో త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దౌత్రే అన్నారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన గ్యారెంటీ పథకాలు పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లాలో ప్రజా పాలన సేవా కేంద్రాలను పూర్తిస్థాయి ఏర్పాట్లతో త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్, జిల్లా పంచాయతీ అధికారి సమన్వయంతో సాంకేతిక విభాగంపై ప్రత్యేక దృష్టి సారించి దరఖాస్తులను డిజిటలైజ్ చేయడంలో జాగ్రత్త వహించాలని తెలిపారు. జిల్లాలో లక్షా60వేల దరఖాస్తులు వచ్చాయని, అర్హులైన లబ్ధిదారులకు గ్యాస్, విద్యుత్ పథకాలను అమలు చేయడంలో ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. మొబైల్, ఓటిపి, ఆధార్, రేషన్ కార్డులు, దరఖాస్తు, గ్యాస్‌బుక్ సంఖ్య, డెలివరీ రిపోర్ట్ అన్ని వివరాలను పరిశీలించాలని తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో 15, పట్టణ ప్రాంతాలలో 2 ప్రజా పాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, కంప్యూటర్ ఆపరేటర్లు, సహాయకులతో జూమ్ మీటింగ్ ద్వారా దశల వారీగా వివరాలు పర్యవేక్షించాలని తెలిపారు. ఎంపీడీవోలు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఈజీఎస్ కింద ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని, పని ప్రదేశాలను తప్పనిసరిగా సందర్శించి తాగునీరు, నీడ, వైద్య సేవలు ఇతర అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచడంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, 100 రోజుల పని కల్పించడం జరుగుతుందని, జిల్లాలో 1లక్ష71వేల జాబ్ కార్డులు ఉన్నాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలో పనులపై పర్యవేక్షణ జరిపి ఉపాధి కూలీలకు పని కల్పించే విధంగా కూలీల వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలోని గ్రామపంచాయతీలు, పురపాలక సంఘాల పరిధిలో పన్నులను 100 శాతం వసూలు చేసి వివరాలను అందించాలని తెలిపారు. వేసవికాలం కార్యాచరణ ప్రణాళిక రూపొందించి జిల్లాలోని ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, బోర్ వెల్స్, పైపులైన్లు, ట్యాంకులకు అవసరమైన మరమ్మత్తులు త్వరితగతిన చేపట్టి నిరంతరాయంగా తాగునీరు అందించే విధంగా గ్రామీణ నీటి సరఫరా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

తునికాకు వెంటనే టెండర్లు పిలవాలి

- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్
- అటవీశాఖ కార్యాలయంలో వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా తునికాకు యూనిట్లకు టెండర్లు పిలవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన్ సంఘం(టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ కోరారు. మంగళవారం పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ సరోజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సచిన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజలకు వ్యవసాయం తర్వాత తునికాకు 2వ పంటగా(ఉపాధిగా) ఉందన్నారు. అనేకమంది గిరిజనులు, గిరిజనేతర ప్రజలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉందని పేర్కొన్నారు. ప్రతి ఏటా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఫిబ్రవరి చివరివారంలో కొమ్మ కొట్టుడు(ప్రూనింగ్) పనులను ప్రారంభిస్తారన్నారు. ప్రూనింగ్ తర్వాత 4, 5 రోజులకు తునికాను ఏపుగా పెరిగి కోతకు వస్తే ఎక్కువ దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 194 యూనిట్లకుగాను కేవలం 26 యూనిట్లకు మాత్రమే టెండర్లు పిలిచారన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న యూనిట్లకు తక్షణమే టెండర్లు పిలవాలని కోరారు. దాదాపు రాష్ట్రవ్యాప్తంగా 5లక్షల కుటుంబాలకు ఆదాయ వనరుగా ఉన్న తునికాకు సత్వరమే టెండర్లు పిలచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు, నాయకులు స్వామి, ఆశన్న ఉన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో నైపుణ్యాల పెరుగుదల



నవతెలంగాణ-నిర్మల్

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో నైపుణ్య సామర్థ్యాలు పెరుగుతాయని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలికల ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వైజ్ఞానిక ప్రదర్శనలలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల నైపుణ్య, సామర్థ్యాలు పెరుగుతాయన్నారు. ప్రతి విద్యార్థి ప్రశ్నించడం, నేర్చుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలోని 300 మంది విద్యార్థులు వైజ్ఞానిక ఆవిష్కరణలు ప్రదర్శించడం సంతోషకరమని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల్లో విద్యార్థులు మరింత చురుగ్గా పాల్గొనే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలవాలని కోరారు. అంతకుముందు నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఈఓ రవీందర్‌రెడ్డి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి పీవై.రమేష్, డిటిడిఓ అంబాజీ, ప్రజాప్రతినిధులు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగు నీటి సమస్యలు లేకుండా చూడాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-పెంబి

గ్రామీణ ప్రాంతాలలో తాగు నీటి సమస్యలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్యలు లేకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా చూడాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి త్రీఫేజ్ కరెంట్ సౌకర్యం కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ కింద కూలీలకు పని కల్పించే విధంగా చూడాలని తెలిపారు. దొంతి వాగు సమస్యపై అధికారులతో మాట్లాడతానని అన్నారు. అధికారులు అందరూ సక్రమంగా పని చేయాలని తెలిపారు. అధికారులంతా సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని వేణునగర్ గ్రామంలో గృహజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదే విధంగా కొలాం కమ్యూనిటీ సంఘ భవనం, రాముగూడ గ్రామంలో రూ.5లక్షలతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమాకాంత్, ఎంపీపీ కవిత గోవింద్, ఎంపీడీఓ రమాకాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు స్వప్నిల్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మణ్, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఏఈ శ్రీనివాస్, తులాల శంకర్, భూమేష్, స్వామి, మహేందర్, ఎఫ్ఆర్ఓ రామకృష్ణరావ్, ఏఈలు ఉదయ్, విష్ణు, శ్రీనివాస్, పశు వైద్యాధికారి విజయ్ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలతో ఎంతో ఉపయోగం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడా నైపుణ్యాలు వెలికి తీయడానికి క్రీడా పాఠశాలలు ఎంతో దోహదపడతాయని, క్రీడలు బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తాయని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరం కోసం చేపట్టిన ఎంపిక పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు క్రీడా పాఠశాలలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. క్రీడా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర, జాతీయ పోటీలకు ఎంపిక అవుతున్నారన్నారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి మాట్లాడుతూ క్రీడా పాఠశాలల్లో ఎంపిక కోసం నిర్వహించిన పోటీలలో నాలుగో తరగతి చదువుతున్న బాలికలు 124, బాలురు 74 పాల్గొన్నట్లు తెలిపారు. ఈ క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు 9 అంశాలలో నిర్వహించడం జరిగిందన్నారు. అత్యంత ప్రతిభ కనబరిచిన బాలురను ఉట్నూరుకు, బాలికలను ఆసిఫాబాద్‌లో జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు, 20 మంది క్రీడాకారులను బోయినపల్లిలో ఉన్న వాటర్ స్పోర్ట్స్ అకాడమీ ఎంపిక పోటీలకు పంపబడుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ ఉద్ధవ్, జిసిడిఓ శకుంతల, ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, సుధాకర్, ఎస్‌జిఎఫ్. సెక్రెటరీ సాంబశివరావు, పెటా సెక్రెటరీ కృష్ణమూర్తి, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు బిక్కు, వినోద్, షరీఫ్, లక్ష్మణ్, మంగవతి పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బలపరచాలి

- ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా శ్యామనాయక్



నవతెలంగాణ - సిర్పూర్(టి)

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతుందని, విపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా శ్యామనాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, ప్రస్తుతం బీఆర్ఎస్ నాయకుల మాటలు దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టుగా ఉన్నాయని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేసి తీరుతుందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆదిలాబాల్ పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉంటానని, అధిష్టానం టికెట్ ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారం చేపట్టే విధంగా ప్రజలు ఆదరించాలని ఆమె కోరారు. ఆమె వెంట ఆసిఫాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజేంద్రకుమారి, మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, ఉపాధ్యక్షుడు లెండుగురె శంకర్, నాయకులు మంగ, హేమలత, రవీందర్, శ్రీకాంత్, మల్లికార్జున్, నవీన్, గొమాస తిరుపతి, నగేష్, ముకీద్ ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సన్మాన గ్రహీతలతో టీఎస్‌యూటీఎఫ్ సభ్యులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మహిళలు అన్ని రంగాలలో రాణించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కేజీబీవీ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తూ గురుకుల ఉద్యోగాలు సాధించిన స్నేహిత, తిరుమల, శిరీష, స్వప్నిలను సన్మానించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ తిరుమల తన భర్త, కుటుంబసభ్యుల సహకారంతో నాలుగు ఉద్యోగాలను సాధించిందని, ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. సమాజంలో మహిళలకు గౌరవం చదువుతోనే వస్తుందని, దీన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రత్యేకాధికారి రమాదేవి మాట్లాడుతూ విద్యార్థి ఒక లక్ష్యంతో ముందుకు సాగితే అనుకున్నది సాధించడం సులువేనని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల బాధ్యులు హారిక, స్వాతి, ప్రసన్న, సాయిరమణి, కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
2
బుధవారం | మార్చి 06, 2024 | www.navatelangana.com

పట్టణంలోని పలు మీసేవా కేంద్రాల తనిఖీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ఈఎస్‌డీ మీసేవ సెంటర్ కమిషనర్ రవికిరణ్, ఎస్పీఎం నర్సింహా బజ్జూరి ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని పలు మీసేవ కేంద్రాలను ఈడీఎం బండి రవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ రమాదేవి, దస్నాపూర్ బిస్మిల్లా, భుక్తాపూర్ శ్రీధర్, భాస్కర్, గోవర్ధన్ సెంటర్‌లను తనిఖీ చేసి వారి పనితీరును పరిశీలించారు. అనంతరం ప్రజలకు మంచి సేవలు ఇవ్వాలని సూచించారు. జాబ్స్ నోటిఫికేషన్ వస్తున్న నేపథ్యంలో సిటిజన్స్, కరెక్ట్ డాక్యుమెంట్స్ అప్‌డేట్ చేయాలని వివరించారు. ఎటువంటి అధిక రుసుం తీసుకోకుండా సేవలను ప్రజలకు అందించాలని సూచించారు.



కాంగ్రెస్ ఎంపీ టికెట్ సుగుణక్కకు ఇవ్వాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ నుంచి ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా ఆదివాసి ఆడపడుచు ఉద్యమ నాయకురాలు ఆత్రం సుగుణ అక్కకు ఇవ్వాలని ఉమ్మడి జిల్లా విద్యార్థి యువజన సంఘ జేఏసీ నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్ అండ్ బి వద్ద సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆదివాసి గిరిజన మహిళ ఆత్రం సుగుణ అక్కకు టికెట్ ఇస్తే గెలుపు కొరకు శాయశక్తులా కృషి చేస్తామని అన్నారు. నిస్వార్థ పరురాలు ఎవరైనా ఏదైనా సమస్య ఉంటే అందరకీ నేనున్నా అని ధైర్యం ఇచ్చి వారితో ఉండి సమస్య పరిష్కరం కోసం ప్రజల పక్షాన నిలిచే నాయకురాలని అన్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఆమెకు టికెట్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘల జేఏసీ ఉమ్మడి జిల్లా నాయకులు మెస్రం భాస్కర్, సలాం వరుణ్, గేడం కేశవ్, మడవి గణేష్, దత్తు, రఫీక్, అప్సర, రాములు, నరేష్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన రేణి రాజు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మార్చి 3న జరిగిన బహుజన సాహిత్య అకాడమీ కాన్ఫరెన్స్‌లో అకాడమీ అధ్యక్షులు నల్ల రాధకృష్ణ చేతుల మీదుగా మండలంలోని కనకపూర్ గ్రామానికి చెందిన రేణి రాజు ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్నారు. కష్టపడి పనిచేస్తే గుర్తింపు తప్పకుండా లభిస్తుందని అన్నారు. పలువురు విద్యావంతులు, మండల వాసులు రాజును ఈ సందర్భంగా అభినందించారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-జైనథ్

మద్యానికి బానిసై యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన మండల కేంద్రంలో మంగళవారం ఉదయం నెలకొంది. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం... ఇప్ప సుధాకర్(38) కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. సుధాకర్ ఇటీవల మద్యానికి బానిసై గత రెండు రోజుల నుంచి భార్యతో గొడవ పడుతున్నాడు. గొడవ మితిమీరడంతో ఆమె వారి కుమారులతో కలిసి పుట్టింటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మద్యం మత్తులో ఉదయం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించామని తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించిన సంధ్యారాణి



నవతెలంగాణ-ఉట్నూర్

కష్టానికి ఫలితం తప్పకుండా దక్కుతుందని ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించిన సంధ్యారాణికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఉట్నూరు పట్టణంలోని సేవాదాస్ నగర్ నివాసి. రాథోడ్ అనిత గుణవంత్‌రావ్ దంపతుల కుమార్తె సంధ్యారాణి, ఒకే ఇంట్లో నలుగురికి ఉద్యోగాలు ఉన్నాయి. టీజీటీ, పీజీటీ, జెఎల్, డిగ్రీ లెక్చరర్ పోస్టుల నుంచి డిగ్రీ లెక్చరర్ పోస్టులను సంధ్యారాణి ఎన్నుకుంది. సోమవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ లేటర్లను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువు అంటే కష్టం కాకుండా, ఇష్టంతో చదివి, ఒకటే లక్ష్యం పెట్టుకుని ముందుకు వెళ్తే తప్పకుండా అనుకున్నది సాధిస్తామని అన్నారు. తనకు ఒకే సారి నాలుగు ఉద్యోగాలు రావడం సంతోషంగా ఉందన్నారు. ఇంత కష్టపడి చదివిపించిన, మా తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కెమిస్ట్రీ ఉర్దూ మీడియం అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డా.అచ్చి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు పీజీ సంబంధిత సబ్జెక్టులో కనీసం 55శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉన్నా అర్హులేనన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. బోధనా అనుభవం ఉన్న అభ్యర్థులు సంబంధిత ధృవపత్రం అందజేస్తు, వెయిటేజీ ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత ధృవపత్రాలతో ఈ నెల 9న శనివారంలోగా తమ కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని అన్నారు. 11న సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే డెమోకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులు చదువుతో పాటు, ఆటలపై ఆసక్తిని పెంచుకొని, సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించడం అలవాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. మంగళవారం పిల్లల్లో మొబైల్ వాడకాన్ని, వినియోగాన్ని తగ్గించడం కోసం స్థానిక ప్రయివేటు ఒక్లే, మాస్టర్ మైండ్ పాఠశాల ఆధ్వర్యంలో 2కే రన్ ఏర్పాటు చేశారు. ఈ రన్‌కు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం పాల్గొని, జెండా ఊపి ప్రారంభించారు. మొదటగా పాఠశాల విద్యార్థులు, స్థానిక ఎన్టీఆర్‌చౌక్ నుంచి క్రమ పద్ధతిలో స్టేడియం వరకు కొనసాగగా అక్కడ ముగింపు సభ ఏర్పాటు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌ని అత్యవసర సమయాలలో సమాచారం, సంభాషణ ఇచ్చిపుచ్చుకోవడం లాంటి సందర్భాలలోనే వినియోగించడం మంచిదని సూచించారు. ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా పిల్లలను సెల్‌ఫోన్‌కు అంకితం చేసేలా ఉంటుందని, తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ సెల్‌ఫోన్ వీలైనంత తక్కువగా ఇవ్వాలని సూచించారు. తదుపరి విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ముఖ్యఅతిథులు అందరూ సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గిస్తామని ప్రతిజ్ఞను చేశారు. ఈ కార్యక్రమంలో ఒక్లే స్కూల్ డైరెక్టర్ సాయిని రవి, రిజర్వ్‌ఇన్స్‌పెక్టర్ టి.మురళి, కళాశాల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బడా భాయ్.. చోటా భాయ్ వేదికగా మోడీ సభ

- తీవ్ర నిరాశకు గురిచేసిన మోడీ సభ
- మాజీ మంత్రి జోగు రామన్న



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బడా బాయ్ చోటా బై నిర్వహించిన వేదిక ద్వారా జిల్లా ప్రజలకు చేకూరిందేమీ లేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అభివృద్ధిపై కనీస చిత్తశుద్ధి లేని ప్రధాని ఇతర జిల్లాల్లో చేపట్టబోయే ప్రాజెక్టులకు ఇక్కడి నుంచి ప్రారంభోత్సవాలు చేయడం ఏంటని ప్రశ్నించారు. జిల్లా వాసులను అవమానానికి గురి చేసేలా వ్యవహరించారని మండిపడ్డారు. సీసీఐ పునరుద్ధరణ, టెక్స్‌టైల్ పార్క్, రైల్వేలైన్ వంటి అనేక హామీలపై ప్రజలు కోటి ఆశలతో ఉన్నారని అన్నారు. వారి ఆశలపై ప్రధాని నీళ్లు చల్లారని అన్నారు. ఇప్పటి వరకు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ చేసిన ప్రకటనలు అవాస్తవాలని తేలిందని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఖజానా ఖర్చు చేస్తూ, ప్రజలను మభ్య పెట్టడమే తప్ప, జిల్లా వాసుల ఏండ్ల నాటి కలలను సాకారం చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని అన్నారు. ప్రధాన మంత్రి మోడీ పర్యటనతో జిల్లా ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారని అన్నారు. ఆదివాసులపై కపట ప్రేమ చూపుతున్నారని ధ్వజమెత్తిన ఆయన, సిట్టింగ్ ఎంపీలకు టికెట్లు ప్రకటించి, ఆదివాసీ ఎంపీకి ఇంకా టికెట్ ఖరారు చేయకపోవడం బీజేపీకి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రస్తావించకపోవడమే కాకుండా గతంలో ఇచ్చిన హామీలపై కనీసం స్పష్టత ఇవ్వలేదన్నారు. జిల్లా అభివృద్ధికి కనీస చర్యలు తీసుకోని ప్రధానిని ముఖ్యమంత్రి ఎందుకు పొగిడారని ప్రశ్నించారు. ఉపాసనాల నుంచి భోరజ్ వరకు రెండు లైన్ల జాతీయ రహదారిని నిర్మించడం వెనక ఆంతర్యం ఏంటని, ఇది ఖచ్చితంగా తెలంగాణపై వివక్ష చూపడమేనని స్పష్టం చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే ఈ విషయమై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరముందన్నారు. నాలుగు లైన్ల జాతీయ రహదారికి ప్రతిపాదనలు తీసుకువచ్చిన తర్వాతనే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడగాలని సవాల్ విసిరారు. బీజేపీ సిద్ధాంతాల పార్టీ అంటూనే ఇతర పార్టీలకు చెందిన నాయకులకు ఒక్కరోజులో టికెట్లు ఇవ్వడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ గురించి మాట్లాడే అర్హత కిషన్‌రెడ్డికి లేదని స్పష్టం చేశారు. జిల్లా వాసుల అవమానానికి గురి చేసిన బీజేపీకి ఓట్లతోనే తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి నిరంతరం వారి హితాన్ని కోరే బీఆర్ఎస్‌కు రానున్న ఎన్నికల్లో పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. మరోవైపు సోయాబీన్, జొన్నల కొనుగోళ్లపై నిర్లక్ష్యం వహించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకుంటూ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 15వరకే సోయాకొనుగోళ్ల జరుగుతాయని ఉత్తర్వులు వచ్చినా, స్థానిక ఎమ్మెల్యే కనీసం స్పందించడం లేదని అన్నారు. గతంలో ప్రతి చిన్న విషయానికి ధర్నాలు చేసి ప్రస్తుతం రైతులను విస్మరించడం సరికాదన్నారు. సమావేశంలో రైతు సమన్వయ అధ్యక్షులు రోకండ్ల రమేష్, పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, విజ్జగిరి నారాయణ, లింగారెడ్డి, బుట్టి శివకుమార్, బీసీ సెల్ అధ్యక్షులు దాసరి రమేష్, ఆశన్న పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి : అనిల్ జాదవ్

నవతెలంగాణ-తాంసి

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తానని, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం పొన్నారి గ్రామంలో అభయాంజనేయ మొదటి వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రూ.10లక్షల నిధులతో నూతన డిజిటల్ తరగతులను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యేతో పాటు నలుగురు ప్రజాప్రతినిధులను పాఠశాల సిబ్బందితో పాటు విద్యార్థులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాలకు మౌలిక సదుపాయాలతో పాటు అదనపు గదులు ప్రహరీ గోడతో పాటు గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు కేటాయించాలని గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తులందరి ఐక్యమత్యంతో అభయాంజనేయ విగ్రహాన్ని ప్రతిష్టించుకొని మొదటి వార్షికోత్సవం నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

గ్రామానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలోనే గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు అయ్యాయని అన్నారు. గ్రామాభివృద్ధికి పాఠశాల అభివృద్ధి కోసం సహకారం అందిస్తానని, త్వరలో నిరుద్యోగ విద్యార్థుల కోసం లైబ్రరీని ప్రారంభిస్తామని అన్నారు. జూన్ మాసం కల్లా అదనపు గదులతో పాటు ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి చేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ భోజారెడ్డి, జెడ్పీటీసీ రాజు, ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అశోక్, ఎంపీటీసీ రేఖా రఘు, నాయకులు రమణ, అరుణ్, గోవర్ధన్ రెడ్డి, కృష్ణారెడ్డి, లింగారెడ్డి ఉన్నారు.

సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మెన్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి

నవతెలంగాణ-జైనథ్

రైతులకు తీవ్ర అన్యాయం చేసింది జోగు రామన్ననేనని మండల ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగపరుచుకోవాలని అన్నారు. రెండు రోజుల కిందట చిన్నపాటి సాంకేతిక లోపం వల్ల కొనుగోలు కేంద్రాన్ని ఆపివేయడం జరిగిందని దీనిని ఆసరాగా తీసుకొని ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు ధర్నాని చేపట్టం విడ్డూరంగా ఉందని అన్నారు. గతంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న, రైతుల గురించి పట్టించుకున్నదే లేదని, కేవలం రైతులని మభ్యపెట్టడానికి ఇలా చేస్తున్నారని అన్నారు. గతంలో మార్కెట్ చైర్మన్ పదవులను డబ్బులు తీసుకుని అమ్ముకున్న ఘనత జోగు రామన్నకే చెందుతుందని తీవ్ర విమర్శ చేశారు. రైతుల బాధలు తెలుసుకొని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఒక్కరోజులోనే కేంద్రాన్ని ఒప్పించి ఉత్తర్వులు తీసుకురావడం రైతుల నుంచి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కోడిచెర్ల సుదర్శన్, నాయకుల అల్లూరి అశోక్‌రెడ్డి, గడ్డం జగదీష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, కొడిచెర్ల లస్మన్న, అశోక్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రకటించాలి

- కాపులకు అన్యాయం చేసిన గత ప్రభుత్వం
- కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల కంటే ముందే మున్నుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ప్రభుత్వాలు ప్రకటించాలని మున్నురుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య అన్నారు. జిల్లాల పర్యటనలో భాగంగా మంగళవారం ఆదిలాబాద్‌కు రాగా స్థానిక మున్నూరుకాపు సంఘ భవనంలో నాయకులతో రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో మున్నూరుకాపులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కార్పొరేషన్ ఇస్తామన్న హామీని అమలు చేయాలి

ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలోని ఆయా కులాలకు న్యాయం చేసిందన్నారు. కానీ మున్నూరుకాపులను తగిన స్థాయిలో న్యాయం చేయలేకపోయిందన్నారు. ఫైనాన్స్ కార్పొరేషన్ ఇవ్వాలని ఎమ్మెల్యేలు, ఎంపీలు ఒత్తిడి తీసుకువచ్చిన ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇస్తామని హామీ ఇచ్చిందని ఇప్పుడు దాన్ని అమలు చేయాలని కోరారు. అదే విధంగా ఆత్మ గౌరవ భవనాలకు పట్టణ కేంద్రాల్లో 2 ఎకరాలతో పాటు రూ.5 కోట్లను మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్నూరుకాపులను ఐక్యం చేయడానికి పర్యటిస్తున్నామని, ఇప్పటి వరకు 3వ రోజు 7జిల్లాల్లో సమావేశం నిర్వహించామని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య

కార్పొరేషన్‌తో పాటు సమస్యల సాధనకు ఐక్యంగా ఉంటు సాధించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం తాలుక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాళ్ల విఠల్, కలాల శ్రీనివాస్, రఘుపతి, గంట సురేష్ పాల్గొన్నారు.

టైంపాస్ టూర్‌గా మోడీ సభ

- డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశ ప్రధాని మోడీ ఆదిలాబాద్ పర్యటన ఒక టైంపాస్ టూర్‌గా జరిగిందని కాంగ్రెస్ నాయకులు డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని కంది శ్రీనివాస్‌రెడ్డి ప్రజాసేవా భవన్‌లో ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేసి మోడీ సభ పై మాట్లాడారు. గిరిజన యూనివర్సిటీ , టెక్స్ టైల్ పార్క్, విమానాశ్రయం, సీసీఐ, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్ లాంటి దీర్ఘకాలిక డిమాండ్లపై మోడీ ఒక హామీ అయినా ఇవ్వకుండా కేవలం రాజకీయంగా విమర్శలు చేసి వెళ్లిపోయారని అన్నారు. కేవలం ఎన్నికల కోసమే వచ్చారని, ప్రజలను మరోసారి మభ్యపెట్టారని ఆరోపించారు. మూడు నెలల్లో 30వేల ఉద్యోగాలిచ్చిన తమ కాంగ్రెస్ ప్రభుత్వం పైవిమర్శలు తగవన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో కాంగ్రెస్‌ను పోల్చడాన్ని తప్పుబట్టారు. ఆదిలాబాద్ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రధాని మోడీ బీజేపీ విజయ సంకల్ప సభ ఉత్తుత్తి సభ అంటూ విమర్శలు చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని భావించారని అన్నారు. కానీ ఆశలపై నీళ్ల చల్లుతూ ఆయన పర్యటన సాగిందన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ దిగంబర్‌రావు పటేల్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నగేష్, సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, మాజీ ఎంపీపీ మంచికట్ల ఆశమ్మ, నాయకులు ఎం.ఏ.షకిల్, రఫిక్, యాల్ల పోతారెడ్డి, బాయిన్‌వార్ గంగారెడ్డి, రాజ్ మహమ్మద్, బూర్ల శంకరయ్య ఉన్నారు.

ప్రజాపాలన కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలి

- ఎంపీపీ పంద్రా జైవంతరావు



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రజాపాలనలో దరఖాస్తు చేయని వారు ఎంపీడీఓ కార్యాలయంలో వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీపీ పంద్ర జైవంత్ రావ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉమ్రి, ఎన్టీఆర్ నగర్ వాసులు ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి ఎంపీపీకి ప్రజాపాలన దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాపాలనలో దరఖాస్తు చేయని వారు తహసీల్దార్ కార్యాలయంలో నేరుగా అందజేయాలని కోరారు.

బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులకు అభినందనలు



నవతెలంగాణ-నేరడిగొండ

ఇటీవలే బీహార్ రాష్టంలోని పాట్నలో జరిగిన 41వ నేషనల్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాదించింది. తెలంగాణకు ఈ గౌరవాన్ని తీసుకొచ్చిన వారిలో మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు డి.శిరీష, ఎం. అలేఖ్య, బి.వనిత ఉన్నారు. వీరిని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. తమకు సహకరించిన ఎస్ రజిత, పీఈటీ స్నేహ ప్రోత్సహంతోనే పతకాలు సాధించామని విద్యార్థినులు పేర్కొన్నారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తాంసి

అనారోగ్యంతో బాధపడుతూ ఉరేసుకొని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అయినపల్లి నర్సింలు(64) గత కొంతకాలంగా వృద్యప్యంతో పాటు అనారోగ్య కారణంగా మంగళవారం తెల్లవారుజామున పాఠశాల వెనకల గల చేనులో చెట్టుకు వేలాడుతూ ఉదయం స్థానికులకు కనబడగా కుటుంబీకులకు తెలిపారు. కుటుంబీకులు సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. భీంపూర్ ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని శవా పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత ఐదేండ్లుగా పది నుంచి 15తేది వరకు వేతనాలు పడేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ప్రతి నెల ఒకటో తేదిన పడుతున్నాయని తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందిరా అన్నారు. మంగళవారం సంఘ భవనంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందిరా మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదిన సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి గంగధర్ ఆదేశాల మేరకు పాలాభిషేకం నిర్వహించామన్నారు. గత ప్రభుత్వ హయంలో వేతనాల కోసం ఇబ్బందులు పడ్డామన్నారు. ప్రతి నెల వేతనాలు సక్రమంగా రావడంతో ఎలాంటి ఇబ్బందులు ఉండటంలేదని, ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రమేష్‌గౌడ్, అయ్యూబ్ ఖాన్, సంయుక్త కార్యదర్శి రాజేందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కారు, బైకు ఢీకొని ఒకరికి గాయాలు

నవతెలంగాణ-కౌటాల



కారు, బైకు ఢీకొన్న సంఘటన మండలకేంద్రంలోని తాటిపెల్లి చౌరస్తా వద్ద జరిగింది. సిర్పూర్ నుంచి కౌటాలకు వస్తున్న కారును కౌటాల నుంచి సిర్పూర్ వైపుకు బైక్‌పై వెళ్తున్న ఎకోన్కర్ మధూకర్ తాటిపెల్లి రోడ్డు వద్ద కారును ఢీ కొట్టడంతో మధూకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న మధూకర్ కుటుంబసభ్యులు అతనిని అక్కడి నుంచి చికిత్స నిమిత్తం సిర్పూర్ సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లారు.

రుణాలు వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రభుత్వం నుంచి వస్తున్న వివిధ రకాల రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని మాలనుగొంది, తుంపల్లి గ్రామంలో వాటర్ షెడ్ ద్వారా రూ.36.99 లక్షలు, బ్యాంకు రుణం ద్వారా రూ.93.51 లక్షలు, స్త్రీ నిధి ద్వారా రూ.80 లక్షల రుణాలను బ్యాంక్ అధికారులతో కలిసి ఆయా గ్రామాల మహిళలకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులో అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, ఏపీఎం శ్రీనివాస్, స్త్రీ నిధి మేనేజర్ హోక్షు, సీసీలు హనుమంతు, మంగ, వీఓఏలు సుదర్శన్, ధర్మారావ్ పాల్గొన్నారు.

గుండి వాగుపై వంతెన నిర్మించాలని వినతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గుండి గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వాగుపై వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని మాజీ ఎంపీటీసీ జాబరి రవీందర్ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సీఎం ప్రజావాణిలో వినతి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2015లో ప్రారంభమైన వంతెన 9 సంవత్సరాలు పూర్తయినప్పటికీ పూర్తి కాలేదన్నారు. వంతెన నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాంట్రాక్టర్లు, అధికారులు నిర్మాణ పనులపై శ్రద్ధ చూపకపోవడంతో నత్తనడకన కొనసాగుతున్నాయని, అటువంటి వారిపై చర్యలు తీసుకొని నిర్మాణ పనులు వేగవంతం అయ్యేలా చూడాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ ఆర్థిక వ్యవహారాల శాఖ చైర్మన్ చిన్నారెడ్డికి విషయాన్ని వివరించారు.

నెంబర్ లేని వాహనాలు నడిపితే చర్యలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నెంబర్ లేని వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ సతీష్ హెచ్చరించారు. జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 40 నెంబర్ లేని వాహనాలను పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో చాలా మంది వ్యక్తులు వారి వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండానే నడుపుతున్నారని, ఇలా వాహనాలకు నెంబర్ లేకుండ నడుపుతూ ఏదైనా ఏక్సిడెంట్ జరిగినప్పుడు ప్రమాద కారకులను గుర్తించడం కష్టం అవుతుందన్నారు. కొంత మంది సంఘ విద్రోహ శక్తులు నెంబర్ లేకుండ వాహనాలు నడిపి చైన్ స్నాచింగ్, దొంగతనాలు, మహిళలను బైకుల ద్వారా వెంబడించడం చేస్తున్నారన్నారు. ఇక నుంచి ఎవరైనా నెంబర్ ప్లేట్ లేకుండ వాహనాలు నడిపినట్లయితే వారి వాహనాలను సీజ్ చేయడమే కాకుండా కేసు కూడా నమోదు చేయడం జరుగుతుందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కచ్చితంగా కలిగివుండాలని తెలిపారు.

ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా నెహ్రూ యువకేంద్ర ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారి సుశీల్‌బాద్ హాజరై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి లక్ష్మినరసింహం, వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ రాజు, నెహ్రూ యువకేంద్ర వాలంటీర్ మోతీరాం, అధ్యాపకులు జనార్దన్, వెంకటేశం పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ - సిర్పూర్(టి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీల్లో గృహజ్యోతి, గృహలక్ష్మి పథకాల్లో ఎలాంటి సందేహాలున్నా ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో ఏమైన తప్పులుంటే సరిచేసుకోవడానికి ఈ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

జోడేఘాట్‌ను సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-కెరమెరి



గొప్ప పోరాట యోధుడు కుంరంభీం అని నూతన జిల్లా కలెక్టర్ వెంకటేష్ దౌత్రే అన్నారు. సోమవారం మండలంలోని జోడేఘాట్‌ను ఆయన సందర్శించారు. కుంరంభీం విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదివాసుల అస్తిత్వాన్ని అటవీ సంపదను, నమ్ముకున్న భూమిని, నీటిని తమదే అని జల్ జంగల్ జమీన్ నినాదం తో పోరాటం చేసి నిజాం నవాబుకు ఎదురెల్లిన గొప్ప పోరాట యోధుడని పేర్కొన్నారు. భీం పోరాట స్ఫూర్తితో గిరిజనులు చైతన్యవంతం కావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గిరిజన మ్యూజియంలో కలియతిరిగారు. మ్యూజియంలో భద్రపరచినటువంటి ఆదివాసుల సాంప్రదాయ పనిముట్లు అభరణాలను, జీవన విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ పేందూరు మోతిరం, కుమురంభీం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పేందు రాజేశ్వర్ కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ త్రిపాఠి, తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు, ఎంపీడీఓ కృష్ణారావు, ఎస్సై గుంపుల విజయ్ కుమార్, సాంగ్వి మాజీ సర్పంచ్ తొడసం జగన్నాథ్ రావు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ గ్యారంటీ పథకాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమ ద్వారా గ్యారెంటీ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్ఏఎం.రిజ్వి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ప్రజా పాలన సేవా కేంద్రాల సాఫ్ట్ వేర్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన సేవా కేంద్రాల ద్వారా గ్యారెంటీ పథకాల లబ్ధిదారుల ఎంపికకు అవసరమైన ధ్రువపత్రాలను సేకరించి ప్రజాపాలన సాఫ్ట్ వేర్‌లో నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి ఎంపీడీఓ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంలో అవసరమైన మేర ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపర్చినట్టు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్, విద్యుత్ కనెక్షన్ల వివరాలు అనుసంధానమై ఉన్న దరఖాస్తుదారులకు ఇప్పటికే ప్రభుత్వం పథకాల ఫలాలను అమలు చేస్తుందని తెలిపారు. గృహజ్యోతి కింద ఎంపికైన లబ్ధిదారులకు జీరో బిల్లులు పంపిణీ చేస్తున్నామని, ప్రజాపాలన దరఖాస్తు సమయంలో వివరాలు సక్రమంగా నమోదు చేసుకోని వారి నుంచి మళ్లీ దరఖాస్తు చేసుకునేవారు ప్రజాపాలన సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కలెక్టర్ వెంకటేష్ దౌత్రే, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని జిల్లాలో ఏర్పాటు చేసి ప్రజాపాలన సేవా కేంద్రాల వివరాలను తెలిపారు.

ఆస్పత్రి సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ ఉద్యోగులైన, శానిటేషన్, పేషెంట్కేర్, సెక్యూరిటీ సిబ్బందికి పెండింగులో ఉన్న 6నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దౌత్రేకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు పెండింగులో ఉన్న 6 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని, ఈపీఎఫ్ వివరాలు తెలియజేయాలని, చట్ట ప్రకారం ఇవ్వాల్సిన పండుగ, జాతీయ, ఆర్జిత సెలవులు ఇవ్వాలని అన్నారు. జిల్లాలో ఉన్నటువంటి సిహెచ్సి ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యురిటి కార్మికులకు(సిబ్బందికి) కొన్ని ఆసుపత్రిలో 6నెలల నుంచి వేతనాలు చెల్లించలేదన్నారు. దీనివలన కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోలేక అనేక ఇబ్బందులకు గురౌతున్నారని కాంట్రాక్టర్లను, సంబంధిత అధికారులను ఎన్నిసార్లు అడిగిన రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప వేతనాలు చెల్లించడం లేదని అన్నారు. దీంతో తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థంకాక కార్మికులు రోడ్డు మీద పడే పరిస్థితి ఉందని, గత సంవత్సర కాలం నుంచి ప్రతినెల కట్టవలసిన ఈపీఎఫ్‌ను కాంట్రాక్టర్లు, ఏజెన్సీలు కట్టడం లేదని, దీంతో కార్మికులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని, ఇట్టి విషయం సంబంధిత అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తీసుకెళ్లినా కూడా పట్టించుకోవడం లేదని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, చట్టప్రకారం రావాల్సిన పండుగ, జాతీయ సెలవులు, ఆర్జిత సెలవులు అమలు చేయాలని, అలాగే కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, ప్రతి నెల ఈపీఎఫ్ వివరాలను తెలియజేయాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, కార్మికులు నవీన్, రమేష్, చంద్ర శేఖర్, పుష్ప, పద్మ పాల్గొన్నారు.

సాదాసీదాగా సామాజిక తనిఖీ

నవతెలంగాణ-తలమడుగు



మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం నిర్వహించారు. మండలంలో 298 పనులకు గాను రూ.1కోటి 79 లక్షల 40 వేల 167ల ఉపాధి హామీ పనులు జరిగినట్టు ఎస్ఆర్పీ సాయిలు నివేదికలో తెలిపారు. గత వారం రోజులుగా తనిఖీ బృందాలు గ్రామాల్లోకి వెళ్లి జాబ్ కార్డులు తనిఖీలు నిర్వహించగా, అనేక రకాల సమస్యలు వారి దృష్టికి వచ్చినట్లు సామాజిక బృందం తమ నివేదికలో పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో మాస్టర్‌లలో హాజరు వేసి, వైట్‌నర్లతో దిద్దినట్టు, ఉపాధి హామీ సిబ్బంది, కొన్ని రికార్డులు చూపించకపోగా, వర్షానికి తడిసినట్టు తెలిపారు. వివిధ గ్రామాలలోని కూలీలు జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ వారికి జాబ్ కార్డు ఇవ్వలేదని వెల్లడించారు. రుయ్యాడి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా సీసీరోడ్లు నిర్మించినప్పటికీ ఎలాంటి రికార్డులు చూపించలేదని పేర్కొన్నారు. ఉపాధి హామీ కూలీలకు పే స్లిప్పులు ఇవ్వలేదని, మండలంలో లక్షలాది మొక్కలు నాటినప్పటికీ 60 శాతం మొక్కలు బతికి ఉన్నట్లు తెలిపారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో మొక్కల నాటాలని అదనపు డీఆర్డీఓ కుటుంబరావు ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. అదేవిధంగా ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగినట్లయితే శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, క్లస్టర్ పీడీ కృష్ణారావు, ఎంపీడీఓ శేఖర్, ఎస్ఆర్పీ సాయిలు, ఏపీఓ మేఘమాల, ఉపాధి హామీ సిబ్బందితో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

విద్యానిధి పథకానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకానికి అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరిగిందని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో అర్హత కలిగి ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేసుకొని విద్యార్థిని, విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా ఆన్ లైన్‌లో తెలంగాణఇపాస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా తమ వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన న్యాయవాదులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ వెంకటేష్ దౌత్రేను మంగళవారం బార్ అసోసియేషన్ సీనియర్ నాయకులు, న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా వారి మధ్య పలు అంశాలు చర్చకు వచ్చినట్టు తెలిసింది. కలెక్టర్‌ను కలిసిన వారిలో రజి హైదర్, కిషోర్ పాల్గొన్నారు.

గడపపై పడి ఒకరు మృతి

నవతెలంగాణ-కౌటాల



గడపపై పడి ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని ఎడ్లగూడ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధూకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కనిఖీ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎడ్లగూడ గ్రామానికి చెందిన కట్టెకోళ్ల శంకర్(36) గడపపై పడి మృతిచెందాడు. కట్టెకోళ్ల రాంబాయి-పెంటుకు ముగ్గురు కుమారులు. అందులో పెద్ద కుమారుడు కట్టెకోళ్ల శంకర్ రూ.36 వేలకు తనకు చెందిన భూమిని కౌలుకు పెట్టాడు. సోమవారం ఆ డబ్బులతో అధికంగా తాగి ఇంకా డబ్బులు కావాలని తన భార్య కవితను తిరిగి డబ్బులు అడిగాడు. ఇప్పటికే చాలా తాగావని, ఇంకా డబ్బులు ఏం చేస్తావని భార్య అనడంతో భార్యను కాలుతో తన్నటానికి వెళ్లి కాలు జారి ఇంటి గడపపై పడడంతో తల వెనక భాగంలో దెబ్బ తగిలి స్పృహ కోల్పోయాడు. అది గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం కౌటాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకొచ్చారు. మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌కు తీసుకెళ్లాలని చెప్పడంతో కుటుంబీకులు కౌటాల నుంచి కాగజ్‌నగర్‌కు ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు చూసి చనిపోయాడని చెప్పడంతో తల్లి కట్టెకోళ్ల రాంబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

7న మహిళలకు ఓడీ ఇవ్వాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మార్చి ఎనిమిదో తేదీన మహాశివరాత్రి పండగ ఉన్న నేపథ్యంలో తమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏడవ తేదీన మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని దానికి మహిళ ఉపాధ్యాయులకు ఓడీ సౌకర్యం కల్పించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏటుకూరి శ్రీనివాసరావు, ఆడే ప్రకాష్‌లు కోరారు. జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ వెంకటేష్ దౌత్రేను సంఘం తరపున మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వినతి పత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహాశివ రాత్రి సెలవు రోజున మహిళా దినోత్సవం వస్తుందని అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఒకరోజు ముందుగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలోని మహిళా ఉద్యోగులకు ఏడో తేదిన ఓడీ సౌకర్యం కల్పించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు లకావత్ శంకర్, ఎనగంటి బిక్షపతి పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో కబ్జాదారుల చేతుల్లో సింగరేణి క్వార్టర్లు



నవతెలంగాణ - రెబ్బెన

గోలేటిలో గల క్వార్టర్లలో సింగరేణి కార్మికులు నివాసముండే విధంగా చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ డి రవిప్రసాద్‌కు హెచ్ఎంఎస్ యూనియన్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ పత్యం రాజాబాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులు ఉండాల్సిన క్వార్టర్లలో సింగరేణి సంస్థకు సంబంధం లేనివారు కబ్జా చేసుకొని నివసిస్తున్నారన్నారు. కొందరు నాయకులు, ప్రజాప్రతినిధుల చేతుల్లో క్వార్టర్లు కబ్జాకు గురవుతున్నాయని, అటువంటి క్వార్టర్లను సింగరేణి అధికారులు వెంటనే ఖాళీ చేయించాలన్నారు. కొత్తగా అపాయింట్‌మెంట్ అయి వచ్చిన కార్మికులు క్వార్టర్లు అందుబాటులో లేకపోవడంతో అద్దె ఇండ్లలో ఉంటున్నారన్నారు. ఏండ్ల తరబడి ఉద్యోగం చేసిన కార్మికులకు క్వార్టర్లు లేక కిరాయి ఉండాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం అధికారులు చెప్పే మాటలు కాకుండా దీనిపై విచారణ జరిపి నాయబద్ధంగా ఇవ్వాల్సిన సింగరేణి కార్మికులకు క్వార్టర్లు అప్పగించాలన్నారు. సింగరేణిలో 52 వేల క్వార్టర్లు నిర్మించి ఉన్నాయని, కానీ పనిచేస్తున్న కార్మికులు 40 వేల కంటే తక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం క్వార్టర్లు ఇవ్వదలచుకుంటే కాంట్రాక్టర్ లేబర్లు, ప్రయివేటు వాహనాల డ్రైవర్లకు, కాంట్రాక్టు ఉద్యోగులకు, సెక్యూరిటీ గార్డులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఆర్గనైజర్ ఎస్కె ఇనూస్, ఖైరిగూడ ఫిట్ సెక్రటరీ ఖాజాసైక్, సీహెచ్ నారాయణ పాల్గొన్నారు.

కారుణ్య నియామకం కోసం ఇంటర్వ్యూలు

నవతెలంగాణ - రెబ్బెన

సింగరేణి ఉద్యోగం చేస్తూ మెడికల్ ఇన్వాలిడేట్ అయిన, మృతి చెందిన ఉద్యోగుల వారసులకు బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని జీఎం కార్యాలయంలో మంగళవారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇద్దరు మృతి చెందిన ఉద్యోగుల కుటుంబీకులు, ఇద్దరు మెడికల్ ఇన్వాలిడేట్ అయిన ఉద్యోగుల వారసులు కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులకు ఎస్ఓటు జీఎం మచ్చగిరి నరేందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి ఇంటర్వ్యూ నిర్వహించి ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. సింగరేణి సంస్థ ద్వారా అందే బెనిఫిట్స్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీజీఎం సివిల్ సతీష్‌బాబు, డీజీఎం సీఎస్పీ భీంరావు జాడె, సెక్యూరిటీ మేనేజర్ వరప్రసాద్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-నస్పూర్



ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రాల్లోని ఆర్టీసీ డిప్యూటీ సూపరింటెండెంట్ రాములుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గం అన్నవరం ఊరు, నుంచి ఉదయం 8 గంటలకు వెళ్లాలని, సాయంత్రం చెన్నూర్ 4 గంటల వరకు బస్సు వెళ్లేలా చూడాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్ష రాసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పరీక్ష సమయానికి చేరుకునేలా, రాసిన తర్వాత గమ్యానికి చేరే విధంగా బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

'ప్రజల మేలు కోసమే ఉపాధి హామీ పనులు'

నవతెలంగాణ-జన్నారం



ప్రజల మేలుకోసమే గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ప్రారంభిస్తున్నట్లు మండల ఎంపీడీఓ శశికళ అన్నారు. మంగళవారం మండలంలోని ఇందన్‌పల్లి గ్రామ శివారులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. అన్ని గ్రామాల్లో ఉన్న నిరుపేదలకు జాబ్ కార్డులను జారీ చేస్తూ వారికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో నీడ, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సింగిడి రమేష్, ఈజీఎస్ ఏపీఓ రవీందర్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక పెద్దమ్మ తల్లి మద్యం దుకాణంలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పైకప్పు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. మంగళవారం ఉదయం మద్యం దుకాణం నిర్వాహకులు తెరిచేసరికి దొంగతనం జరిగిందని గమనించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మద్యం దుకాణ యజమాని అయిందాల సదయ్య పిర్యాదు మేరకు మందమరి సీఐ శశిధర్‌రెడ్డి పరిశీలించారు. ఫోరోనిక్స్ సీఐ అశోక్ ఆధ్వర్యంలో క్లూస్ టీంతో వేలిముద్రలు పరిశీలించారు. నగదు రూ.40,000 బ్లాక్ అండ్ వైట్ బాటిల్స్ మూడు రూ.6,120, కింగ్ ఫిషర్ బీర్ టిన్స్(5) రూ.800, 3 ఓసీ ఆఫ్ బాటిల్స్ రూ.900, రెడ్ మీ సెల్ ఫోన్ ఒకటి రూ.15 వేలు, మొత్తం రూ.62 వేల ఎనిమిది వందల ఇరవై చోరీ జరిగినట్టు తెలిపారు. ఈ మేరకు రామకృష్ణాపూర్, ఏఎస్ఐ నూనె శ్రీనివాస్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

అనాథాశ్రమంలో ప్రమాణాలు పాటించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో పిల్లల సంక్షేమం కోసం పని చేసే అనాథాశ్రమాల్లో కనీస ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా స్త్రీ, శిశ, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కె.చిన్నయ్యతో కలిసి అధికారులు, అనాథాశ్రమాల నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పిల్లల సంక్షేమానికి పని చేస్తున్న అనాథాశ్రమాలు బాలల రక్షణ చట్టం ప్రకారం కనీస ప్రమాణాలు పాటించాలని తెలిపారు. జిల్లాలో అన్ని పిల్లల అనాథాశ్రమాలను పరిశీలన కమిటీ ఇప్పటికే సందర్శించిందని, జిల్లా అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తారని, అన్ని అనాథాశ్రమ నిర్వాహకులు బాలల చట్టం ప్రకారం రిజిస్టర్లు, సీసీటీవీలు మెను, ఇతర అన్ని అంశాలను సక్రమంగా నిర్వహించాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎన్. ఆనంద్, ఇన్స్టిట్యూషనల్ కేర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పి.సత్తయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

- తహసీల్దార్ వనజారెడ్డి



నవతెలంగాణ-జైపూర్

మండలంలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్థానిక తహసీల్దార్ వనజారెడ్డి హెచ్చరించారు. ఇందారం గ్రామ పంచాయతి కాచన్‌పల్లి శివారులో సోమవారం ఇసుక డంపును గుర్తించిన ఆమె అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నవారి పట్ల కఠినంగా వ్యవహరించారు. కాచన్‌పల్లి శివారులో ఇసుక నిల్వ చేసివుంచినట్లు అందిన సమాచారం మేరకు మైనింగ్ అధికారులతో కలిసి ఘటనా స్థలాన్ని సందర్శించినట్లు తెలిపారు. ఇసుక అక్రమణదారులు పట్టణ ప్రాంతాలకు ఇక్కడ ఇసుక నిల్వ చేసివుంటారని అన్నారు. ఘటనా స్థలంలో నిలువ చేసిన సుమారుగా 38 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను మైనింగ్ అధికారులతో కలిసి స్వాధీనపర్చుకున్నట్లు పేర్కొన్నారు.

న్యాక్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-కాసిపేట

న్యాక్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత శిక్షణను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాసిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ పొందుతున్న కార్మికులకు యూనిఫామ్, బ్యాగ్, హెల్మెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ భవన నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో అర్హులైన కార్మికులకు 15 రోజులు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ఉపకారవేతనం కింద శిక్షణ పూర్తి అయ్యే వరకు రోజుకు రూ.300తో పాటు మధ్యాహ్న భోజన సదుపాయం ఉంటుందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఎంతగానో ఈ శిక్షణ ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్‌లు పి. స్వప్న రాణి, శంకర్, ఉపాధ్యాయులు సాంబ మూర్తి పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన ఉండాలి

- రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్



నవతెలంగాణ-జైపూర్

ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశంపై అధికారులకు అవగాహన కలిగి ఉండాలని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీస్ అధికారులతో పాటు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోవు లోక సభ ఎన్నికల సంధర్బంగా పోలీసులు ఎన్నికల సంఘం నిబందనల మేరకు పని చేయాలని సూచించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో మోస్ట్ ఎఫెక్టెడ్ పోలింగ్ స్టేషన్‌లను గుర్తించి బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. పోలీసు అధికారులు సంబంధిత పోలింగ్ స్టేషన్లపై పూర్తి స్థాయి అవగాహణతో పకడ్బందిగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వాహణ పరికరాలు తీసుకుపోవడం కోసం రూట్ చెకింగ్, పోలింగ్ స్టేషన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవలన్నారు. గత ఎన్నికల సమయంలో పోలింగ్ నెమ్మదిగా జరిగి సమస్యలు ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి అట్టి సమస్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని అన్నారు. ఐడీ లిక్కర్, గంజాయి, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా, నిల్వలపై ప్రత్యేక నిఘా ఉండాలని, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో పని చేస్తూ ఆబ్కారి శాఖతో సంయుక్తంగా దాడులు నిర్వర్తించాలని అన్నారు. ఇంతకు ముందు ఎలక్షన్ సమయంలో సమస్యలను సృష్టించిన వారిపై పూర్తి నిఘాతో వారిని రౌడీ షీటర్స్‌ను సస్పెక్ట్ షీట్ ఉన్న వారిని హిస్టరీ షీట్ ఉన్న వారిని బైండోవర్ చేయాలని తెలిపారు. ఎన్నికల సమయంలో కమ్యూనికేషన్ అనేది చాల ముఖ్యమని పోల్టికల్ వైలెన్స్, దాడులు, లా అండ్ ఆర్డర్ సమస్య, గొడవలు సృష్టించే అవకాశం ఉన్న వాటిని నియంత్రించాలని అన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-జన్నారం



ఈ నెల మూడున, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో జరిగిన 7వ నేషనల్ లెవెల్ కరాటే, కుంగ్ ఫూ ఓపెన్ ఛాంపియన్ షిప్ 2024 పోటీల్లో రాఘవేంద్ర లిటిల్ హన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు 19 మంది పాల్గొని, బంగారు. వెండి పతకాలను సాధించారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఆ విద్యార్థులను జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు చదువు, ఆటలు మాత్రమే కాకుండా ఆత్మ రక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ లాంటి కరాటే, కుంగ్ ఫూ లాంటి విద్య కూడ నేర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎర్ర సంపత్, పాఠశాల ప్రిన్సిపాల్, డీన్ హేమలత షిండే, కరాటే మాస్టర్ సంజీవ్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదివిన గురుకులంలోనే పాధ్యాయురాలిగా ఉద్యోగం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన దుర్గం అఖిల టీజీటీ-సైన్స్ ఉద్యోగాన్ని సాధించి సోమవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా, నియామకపత్రం అందుకున్నారు. చింతగూడ గ్రామానికి చెందిన దుర్గం నందయ్య-ప్రమీలాదేవి దంపతుల కుమార్తె అఖిల 5 నుంచి 12వ తరగతి వరకు కడెం మండలం నచ్చెన్ ఎల్లాపూర్‌లోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశా లలో చదువుకున్నారు. డిగ్రీ, బీఈడీ పూర్తి చేశారు. అఖిల నాన్న నందయ్య ఎల్ఐసీ ఏజెంట్, అమ్మ ప్రమీలాదేవి గృహిణి, చిన్న తనం నుంచి తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను చూసి ప్రభుత్వ కొలువు సాధించాలనే పట్టుదలతో చదివి టీజీటీ-సైన్ ఉద్యోగాన్ని సాధించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉన్నత స్థానాల్లో నిలిచిన గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రను చదువుకో వడంతో ఉద్యోగం సాధించినట్లు అఖిల చెప్పారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ఆరోపణలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

అమలు కానీ హామీలను ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన సందర్భంగా లక్షెట్టిపేట పట్టణంలోని ఐబీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కానీ హామీలను ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసిందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా కేసీఆర్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. వ్యవసారంగం, విద్య, వైద్య రంగంలో ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాళేశ్వరం ప్రాజెక్టుపై లేనిపోని ఆరోపణలు చేస్తూ గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ కాలం వెళ్ళబుచుకుంటున్నారని పేర్కొన్నారు. ఎన్ని ఆరోపణలు చేసిన కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులు ప్రతి ఒక్కరి గుండెలో ఉన్నాయని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడుతుందని పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా నియమించినందుకు చాలా సంతోషంగా ఉందని, తనకున్న అనుభవంతో కచ్చితంగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలు గతంలో జరిగిన ఓటమిని పక్కనపెట్టి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని ఏ అవసరం వచ్చినా తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, యువ నాయకులు నడిపెల్లి విజిత్ రావు, డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, పట్టణ అధ్యక్షులు పాదం శ్రీనివాస్ పాల్గొన్నారు.



మహిళా దినోత్సవం సందర్బంగా ఆటల పోటీలు

నవతెలంగాణ-మందమర్రి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలను నిర్వహించారు. మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా మంగళవారం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మందమర్రి సీఈఆర్ క్లబ్‌లో మహిళలకు ఆటలు, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సేవా సమితి అధ్యక్షురాలు ఏ సవిత మనోహర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సవిత మనోహర్ పోటీలకు హాజరైన మహిళలందరికీ ముందస్తు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి పోటీలను ప్రారంభించారు. త్రో బాల్, బాంబ్ ఇన్ బ్లాస్ట్, మ్యూజికల్ బాల్ ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొనడానికి 200 మంది మహిళలు, సింగరేణిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, కమ్యూనికేషన్ సెల్ సేవాసమితి కోఆర్డినేటింగ్ ఆఫీసర్ ఎండీ ఆసిఫ్ పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడిగా జెట్టి శంకర్‌రావు

నవతెలంగాణ-నస్పూర్

ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడిగా జెట్టి శంకర్‌రావును నియమించారు. ఆ సంఘం జాతీయ కార్యదర్శి, సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ మంగళవారం శ్రీరాంపూర్ బ్రాంచ్ నూతన కమిటీని ప్రకటించారు. గడిచిన దశాబ్దా కాలంగా అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని శ్రీరాంపూర్ ఏరియాలో ఐఎన్టీయూసీని బలమైన కార్మిక సంఘంగా నిలబెట్టడంలో సీనియర్ నాయకులు జెట్టి శంకర్రావు కృషి చేశారని తెలిపారు. కేంద్ర కమిటీ నిర్ణయాలకు అనుగుణంగా కార్మిక క్షేత్రంలో పనిచేయాలని అలాగే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని కోరారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న, ప్రజాపాలన సేవ కేంద్రంలో మళ్లీ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారెంటీల పథకాలలో భాగంగా గృహ జ్యోతి విద్యుత్ జీరో బిల్లులు చాలామందికి రాలేదు. ఆ ప్రజల కోసం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజా పాలన దరఖాస్తు సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గృహజ్యోతి దరఖాస్తులను ఈ ప్రజా సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ శశికళ తెలిపారు. దరఖాస్తులు స్వీకరిస్తున్న వారిలో ఈఓపీఆర్డి రమేష్ అన్నారు.

రెడ్‌క్రాస్ ప్రజా సేవలో ముందుండాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తోందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్న అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఆ సొసైటీ అధ్యక్షుడు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ప్రజా ఉపయోగకర కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. రెడ్ క్రాస్ సొసైటీ కార్యక్రమాలు విస్తృత పరిచి, కార్యచరణ ప్రకారం నిరంతరంగా సేవలు అందించాలని తెలిపారు. జిల్లా సహకార శాఖ అధికారి, ఎన్నికల అధికారి నర్సయ్య 15 మంది సభ్యులతో కూడిన నూతన పాలక మండలిని ప్రకటించారు. జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా బొప్పు సతీష్, కోశాధికారిగా కె.సత్యపాల్‌రెడ్డి, సభ్యులుగా ఊరుగొండ మధుసూదన్‌రెడ్డి, చందూరి మహేందర్, కాసర్ల శ్రీనివాస్, యెడ్ల కిషన్, సురభి శరత్‌కుమార్, ఉదారి చంద్రమోహన్, పవన్‌కుమార్ తివారి, కేశెట్టి సంతోష్‌కుమార్, ములుకల్ల సత్యనారాయణరెడ్డి, కటుకం హరీష్, బుద్దినేని సత్యనారాయణరావు, చుంచు శంకరయ్యలను ఎన్నుకున్నారు.



11 నుంచి సదరం శిబిరాలు

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో ఈ నెల 11 నుంచి సదరం శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించనున్న సదరం శిబిరాలకు హాజరు అయ్యేందుకు మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని, సదరం సర్టిఫికెట్ కాలపరిమితి ముగిసిన వారు పున:రుద్దరణకు నూతన సర్టిఫికెట్ పొందేందుకు నిర్ణీత తేదీలలో హాజరు కావాలని తెలిపారు. ఈ నెల 11న మూగ, చెవుడు(50), శారీరక దివ్యాంగులు-ఆర్థో(50), 20న మూగ, చెవుడు(50), శారీరక దివ్యాంగులు(50)లకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఈ నెల 7వ తేదీ ఉదయం 11 గంటలకు స్లాట్ ఓపెన్ చేయడం జరుగుతుందని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జాతర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

- ఎంపీడీఓ సత్యనారాయణ



నవతెలంగాణ-జైపూర్

మహాశివరాత్రిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహించే వేలాల మల్లన్న జాతర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు ఎంపీడీఓ గుర్రం సత్యనారాయణ గౌడ్ తెలిపారు. మంగళవారం వేలాల గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించిన ఆయన జాతర సంధర్బంగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నెల 8 నుంచి 10 వరకు వేలాల మల్లన్న జాతర నిర్వహించనున్న గ్రామ పంచాయతి పరిధిలో మురికి కాలువలు, ప్రధాన రహదారులు శుభ్రం చేయించడంతో పాటు తాగు నీటి వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా శివ్వారం గ్రామ పంచాయతి పరిధిలో కొనసాగుతున్న గ్రామీణ ఉపాధిహామీ పనుల నిర్వాహణను పరిశీలించిన ఆయన నిర్దేశిత కొలతలతో కందకాలు తవ్వినప్పుడే కూలీ గిట్టుబాటు అవుతుందని తెలిపారు. కిష్టాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఈజీఎస్ ద్వార నిర్మించిన రోడ్డు పనులను పరిశీలించారు. ఈ కార్యమంలో ఎంపీడీఓ వెంట ఈజీఎస్ ఏపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-నస్పూర్



కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గని మేనేజర్ ఖాదిర్‌కు మంగళవారం ఆ సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. దీనికి గని మేనేజర్ సానుకూలంగా స్పందించి, యూనియన్ నాయకులతో సమస్యలపై చర్చించి వారం రోజుల్లోగా పరిష్కరిస్తామని తెలిపారు.

నేడు రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మంటలంలోని రైతు వేదికలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్టు మంగళవారం వ్యవసాయ అధికారి చల్లా ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12.00 గంటలకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి చేతుల మీదుగా ఆన్‌లైన్‌లో రైతులతో ముఖాముఖి అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు, ప్రజాప్రతినిధులు, మీడియా మిత్రులు హాజరు కావాలని కోరారు.

వానరాల దాహార్తి తీర్చడం బాధ్యతగా భావిద్దాం

నవతెలంగాణ-జైపూర్

వేసవిలో వానరాల దాహార్తి తీర్చడం ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని భీమారం గ్రామానికి చెందిన బుల్లి తెర నటుడు బెల్లంకొండ భగీరత్ విజ్ఞప్తి చేశారు. చెన్నూర్ - మంచిర్యాల ప్రధాన రహదారిలో గల వెలిశాల మల్లన్న దేవాలయం సమీపంలో కుటుంబ సభ్యులతో కలిసి నీటి తొట్టిని ఏర్పాటు చేశారు. వెలిశాల మల్లన్నను దర్శించుకోడం కోసం వచ్చే భక్తులతో పాటు ఈ రహదారి మీదుగా ప్రయాణించే వారు నీటి తొట్టిని ఎప్పటికప్పుడు నింపుతూ వనరాల దాహార్తి తీర్చాలని కోరారు.

రాహుల్‌గాంధీ పాలన కోసం ఏకం కావాలి

నవతెలంగాణ - రెబ్బెన

వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని గోలేటి ఖైరిగూడలో పర్యటించి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సోనియాగాంధీ ఇచ్చిన హామీలను నేటి ప్రభుత్వం వందకు వంద శాతం అమలు చేస్తుందని, కాంగ్రెస్ ఇచ్చిన మాట తప్పదని పేర్కొన్నారు. ఇప్పటికే ఆరు గ్యారెంటీల్లో నాలుగు గ్యారంటీలు అమలు చేసిందని, రాబోయే రోజుల్లో పేదలకు, మరెన్నో సంక్షేమ పథకాలు అందిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వచ్చే ఏడు నియోజకవర్గాల్లో ప్రతి మూడు మారుమూల ప్రాంతాలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ దేశంలో అధికారంలోకి రావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లావుడ్య రమేష్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

నవతెలంగాణ-జైనథ్



ఉరేసుకొని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం మండలకేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. కనక రాందాస్(70) గత కొన్ని రోజుల నుంచి మోకాలి నొప్పితో బాధపడుతున్నాడు. ఈ నొప్పిని భరించలేక ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

జిల్లా అభివృద్ధి పట్ల కేంద్రం కపట ప్రేమ

- జిల్లా వాసులను నిరుత్సాహ పర్చిన మోడీ సభ
- ఆదిలాబాద్ అభివృద్ధి సాధన కమిటీ కన్వీనర్ బండి దత్తాత్రి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి పట్ల కపట ప్రేమ కనబరుస్తుందని ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి సాధన కమిటి కన్వీనర్ బండి దత్తాత్రి అన్నారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మోడీ సభ జిల్లా ప్రజలను నిరాశ పర్చిందన్నారు. జిల్లా ప్రజలు పార్లమెంట్ సభ్యుడితో పాటు ఎమ్మెల్యేను గెలిపించి బీజేపీకి కానుకగా ఇచ్చారు. కానీ బీజేపీ జిల్లా ప్రజల చిరకాల వాంచ అయిన సీసీఐ పునరుద్ధరణ, ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వే లైన్, విమానాశ్రయం, గిరిజన యూనివర్శిటీ, టెక్స్‌టైల్ పార్క్ లాంటి అభివృద్ధికి ఉపయోగపడే పనులు చేయకుండా మత విద్వేషాలు, సెంటిమెంట్ నమ్మకాల పేరుతో మోసం చేస్తుందన్నారు. బీజేపీ పాలన పదేండ్లు పూర్తి చేసుకొని మళ్లీ ఒకసారి అధికారం ఇవ్వండని అంటు ప్రజలను ఓట్లు అడుగుతోందని అన్నారు.

పదేండ్ల కాలంలో అమలు కానీ హామీలు..

ఈ పదేండ్ల కాలంలో ప్రధాన సమస్యలు ఒకటి కూడా అమలు చేయకుండా ప్రజలను ఎలా ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. జిల్లా ప్రజలు, ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు, ఐక్య వేదికలుగా ఏర్పడి పోరాటాలు చేస్తున్న కేంద్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాదు, దేశంలోనే జిల్లా పారిశ్రామిక అభివృద్ధిలో వెనుకబడి ఉందని పేర్కొన్నారు. ఆదివాసులు, దళితులు, వెనుకబడిన తరగతుల జనాభ అత్యధిక శాతం ఉన్న జిల్లా అక్షర క్రమంలో ముందు ఉన్న అభివృద్ధిలో వెనుకబడి ఉందన్నారు. జిల్లా పారిశ్రామికంగా వ్యవసాయపరంగా అభివృద్ధి చెందాలంటే నిరుద్యోగ యువతులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కాలన్నారు. ఇందుకోసం జిల్లా ప్రజానీకం కేంద్ర ప్రభుత్వంపై పోరాడాలన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా ఏకమై బీజేపీని ఓడించాలని, అప్పుడైన కేంద్ర పాలకులు కండ్లు తెరిచి జిల్లా అభివృద్ధిపై దృష్టి సారిస్తారని హితవు పలికారు. సీసీఐలో ఇంకా 100 ఎండ్లు నడవగల ముడి సరుకు ఉందన్నారు. ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వే మార్గం వేస్తే రాజధానికి ప్రయాణం సులభం అవుతుందని తెలియజేశారు. ఫలితంగా పరిశ్రమలు విద్యా, వైద్యం ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. విమానాశ్రయం ఏర్పాటు చేస్తే అంతర్జాతీయ రాష్ట్ర ప్రయాణాలతో జిల్లా పారిశ్రామిక శోభ సంతరించుకుంటుందని పేర్కొన్నారు. తెల్ల బంగారాన్ని(పత్తి) దక్షిణ భారతదేశంలోనే అత్యంత నాణ్యత కలిగిన పత్తిని మన జిల్లా రైతాంగం పండిస్తున్నదని ఇక్కడ టెక్స్‌టైల్స్ పార్క్ లేదని అన్నారు. కనీసం విత్తన తయారి కేంద్రం లేదని అన్నారు. ఆదివాసుల జిల్లాగా పేరొందిన మనకు గిరిజన యూనివర్సిటి దక్కకుండా చేశారని మండిపడ్డారు.



జిల్లా అభివృద్ధికి పాటు పడాలి...

ఎన్నికల బహిరంగ సభలో కేంద్రం పెద్దలు ఇచ్చిన హామీలు నీటి మిద రాతలుగానే మిగిలిపోతున్నాయన్నారు. మళ్లీ ఎన్నికలు వస్తేగాని జిల్లాకు ఇచ్చిన హామీలు వారికి గుర్తుకు రావడం లేదని అన్నారు. జిల్లాను అభివృద్ధి పర్చుకోవాలనే కాంక్షతో సోంత జెండాలు ఎజెండాలు పక్కన పెట్టి, ప్రతి పక్షాలు ప్రజా సంఘాలు, సామాజిక సంస్థలు, విద్యార్థి. యువజన సంఘాలు ఏకమై ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి సాధన పోరాట కమిటిగా ఏర్పడి కేంద్రంపై పోరాటం చేస్తున్నాయన్నారు. భవిష్యత్తు తరాలకోసం జరుగుతున్న పోరాటంలో అందరూ పాల్గొని జిల్లా అభివృద్ధికి పాటు పడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సాధన కమిటీ సభ్యులు ఉన్నారు.

భగత్‌సింగ్ కాలనీలో సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని భగత్‌సింగ్ నగర్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని మంగళవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు డిమాండ్ చేశారు. కాలనిలో 15 వందల నుంచి 2 వేల వరకు జనాభా ఉందన్నారు. కాలనీలో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారని, ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే కాలనీలో బస్తీ దవాఖాన, రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ విషయాలపై మంగళవారం డీఈఓ ప్రణీత, డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, పౌరసరఫరాల అధికారిని వేరువేరుగా కలిసి వినతి పత్రాలను అందజేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు స్వామి, సహాయ కార్యదర్శి ఆశన్న, నాయకులు పూసం సచిన్ ఉన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ యువతకు 5నెలల ఫౌండేషన్ కోర్సును ఉచితంగా అందిస్తున్నామని ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేష్ తెలిపారు. మంగళవారం సెంట్రల్ లైబ్రరీలో అభ్యర్థులకు రెసిడెన్షియల్ కోర్సుల వివరాలపై అవగాణ కల్పించారు. ఐదుల నెలల రెసిడెన్షియల్ కోర్సుతో పాటు మూడు నెలల పాటు గ్రూప్ వన్ స్పెషల్ ఫౌండేషనల్ కోర్సు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ పోటీ పరీక్షల కోసం ప్రభుత్వం ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా నిష్ణాతులైన వారితో శిక్షణ అందిస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ పాస్ అయిన అభ్యర్థులు ఈనెల 6లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 16న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఇందులో అర్హత సాధించిన వారికి భోజన సౌకర్యంతో ఐదు నెలల పాటు శిక్షణాలు అందిస్తామన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా స్కాలర్‌షిప్ కోసం ఈ నెల ఒకటి నుంచి 31 తేదీ వరకు జిల్లాలో అర్హత గల ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి బి.సునీత కుమారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు ఈపాస్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రూప్-1 ఎగ్జామినేషన్ కొరకు ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిఎండబ్ల్యూఓ రమేష్ రాథోడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన మైనార్టీ(ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు) దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 20లోపు ఆదిలాబాద్‌లోని శాఖా కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. పూర్తి వివరాల కోసం 9440332859 నెంబరును సంప్రదించాలని సూచించారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే ఏలేటి పర్యటన

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ప్రారంభోత్సవానికి బుధవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్టు బీజేపీ నాయకులు సురకంటి ముత్యంరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల నాయకులు, కార్యకర్తలు. అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-తలమడుగు



మహిళలు మనోధైర్యాన్ని కోల్పోకుండా అన్ని రంగాల్లో రాణించాలని సీడీపీఓ నర్సమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలలను శాలువాలతో సన్మానించి, మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. సమాజాభివృద్ధికి మహిళల పాత్ర కీలకమని అన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విటమిన్ పౌష్టికాహారం తీసుకున్నట్లయితే శారీరికంగా ఆరోగ్యంగా ఉంటామనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ, మిషన్ శక్తి సిబ్బంది కృష్ణవేణి, సఖి సెంటర్ లావణ్య అంగన్‌వాడీ టీచర్లు మంజుల, రమణ, పద్మ, ఆయాలు వెంకటమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-సిరికొండ

ఎంపీపీ పెందూర్ అమృత్‌రావ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ముందుగా ఇన్‌చార్జ్ మండల వ్యవసాయ అధికారి కైలాస్ మాట్లాడారు. రైతులు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కోసం డబ్బులు జమ కానివారు ఈకేవైసీ చేసుకోవాలని అన్నారు. లైన్‌మెన్ లింగన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మీటర్లను అమర్చుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విద్యుత్ జీరో బిల్లులు రానివారు విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించాలని అన్నారు. గ్రామాల్లో పగటిపూట విద్యుత్ బల్బులు వెలుగుతున్నాయని పలువురు వారి దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని పలు గ్రామాల్లో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా మిషన్ భగీరథ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీపీ మిషన్ భగీరథ ఏఈ జైపాల్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాల గంగాధర్, తహసీల్దార్ విజయ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడాలి



నవతెలంగాణ-ఖానాపూర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై ఐక్యంగా అందరూ కలిసి పోరాడాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బొప్పని పద్మ అన్నారు. మంగళవారం ఖానాపూర్ విద్యానగర్‌లో తలారి గంగన్న భవన్ పేరిట ప్రజా సంఘాల కార్యాలయంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, గిరిజన సంఘం కార్యాలయాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు ఐక్యంగా కలిసి ప్రజాపోరాటాలు నిర్వహించాలని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఈ కార్యాలయం నుంచి ఉద్యమాలు నిర్వహించాలని అన్నారు. అనంతరం జిల్లా సీనియర్ నాయకులు దుర్గం పోషలింగం ఆకొండపేట గ్రామ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికై ఐదు సంవత్సరాలు తన పదవిని పూర్తి చేసుకొని ప్రజలకు సేవ చేసినందుకు ఆయనను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శాలువా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, సంఘం సీనియర్ నాయకులు దుర్గం పోశలింగం, ఆకొండపేట గ్రామ మాజీ సర్పంచ్, వ్యవసాయ కార్మిక సంఘం, నిర్మల్ మండల కార్యదర్శి చందుల సాయికిరణ్, రైతు సంఘం నాయకులు బోసు భూమన్న, అంగన్‌వాడీ యూనియన్ ఖానాపూర్ మండల అధ్యక్షులు సరోజ, కార్యదర్శి మునెంద్ర, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఖానాపూర్ అధ్యక్షులు మునుగురి గంగాధర్, గ్రామపంచాయతీ యూనియన్ ఖానాపూర్ మండల ఉపాధ్యక్షులు రాజేశ్వర్, చుంచుల నారాయణ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహజ్యోతి, గృహలక్ష్మి పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు, నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎంపీడీఓ, మున్సిపాలిటీ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కేంద్రాల్లో ప్రజలు ప్రజాపాలనకు సంబంధించిన దరఖాస్తులు అందజేయవచ్చునని తెలిపారు. ప్రజాపాలన సేవా కేంద్రాల్లో తగినన్ని దరఖాస్తు చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు కల్పించాలని అన్నారు. ఇప్పటికే ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా పథకాల కోసం ప్రజల నుంచి తీసుకున్న దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఏవైనా తప్పులు నమోదైతే ముందు దరఖాస్తు చేసుకున్న పత్రాలను చూసి సరిచేయాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో సిబ్బందికి ప్రజాపాలన సేవా కేంద్రాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలనీ అన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు చేపట్టాలని, ఉపాధి హామీ చట్టం కింద మంజూరైనా పనులను ప్రారంభించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా పరిషత్ సీఈఓ గోవింద్, జిల్లా పౌర సరఫరాల అధికారి నంధిత, మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంపీడీఓలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మున్నూరు కాపు కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలి



నవతెలంగాణ-నిర్మల్

మున్నూరుకాపు కులస్తులు ఐక్యంగా ఉండి, అన్ని రంగాల్లో రాణించాలని, రాష్ట్ర మున్నూరుకాపు అధ్యక్షులు కొండా దేవయ్య పటేల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అధ్యక్షతన మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ సాధనకై నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయనకు జిల్లా మున్నూరుకాపు సంఘం తరఫున మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మున్నూరుకాపు కుల బంధువులు అత్యధికంగా ఉన్నారని, ఐక్యమత్యంతో ఉండి మన మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ సాధనకు ముప్పై మూడు జిల్లాల్లో పర్యటిస్తూ కుల బందువును చైతన్య పరుస్తున్నామని అన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రెండు ఎకరాల భూమి ఇవ్వాలని, కుల బాలబాలికల భవనం కొరకు రూ.5కోట్లు మంజూరు చేయాలని అన్నారు. కోకాపేట్‌లో మున్నూరుకాపు ఆత్మ గౌరవ భవన నిర్మాణం, రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ రంగంలో ఉన్న కుల బంధువులకు సముచిత ప్రాధాన్యం (నామినేటే)పోస్టులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎంసి.లింగన్న, అయ్యన్నగారి భూమయ్య, ధర్మాజీ రాజేందర్, కులస్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మంగళవారం మాజీ సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్ హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిభాపూలే ప్రజాభవనంలో ఆయాశాఖల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. విద్య, వైద్యం, తాగునీటి, సరఫరాలో ప్రజలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముధోల్లోని కస్తూర్బా పాఠశాలలో ఫ్లోరింగ్ లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే బీసీ, గురుకుల ఎస్సీ హాస్టల్, మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాల అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని వాటికి పక్క భవనాల నిర్మాణం చేపట్టాలని కోరారు. కొత్త బీసీ హాస్టల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా గ్రామంలో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా మిషన్ భగీరథ నల్లా నీరు పెండింగ్‌లో ఉండటం వాటిని మరమ్మతులు చేయించి, ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాలని విన్నవించారు. దీంతో పాటు నూతన కమ్యూనిటీ సీహెచ్‌సీ ఆస్పత్రికి నిధులు రాక కొన్ని సంవత్సరాలుగా పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాని పేర్కొన్నారు. ఈ సమస్యలు పరిష్కరించే ముథోల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

అందరి సహకారంతో మోడీ సభ విజయవంతం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశప్రధాని ఆదిలాబాద్‌కు రావడంతో జిల్లాలో పండుగ వాతావరణం నెలకొందని, సభ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి జిల్లా సమస్యలను విన్నవించడం జరిగిందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఈ సభ అందరి సహకారంతో విజయవంతం అయిందని తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని సభ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు కనివిని ఎరగని రీతిలో ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చారని అన్నారు. 3వ సారి ప్రధానిగా నరేంద్ర మోడీ అవుతారని అన్నారు. జిల్లా సమస్యల గురించి, ప్రధాన మంత్రికి విన్నవించడం జరిగగిందని, దానిపై సానుకూల స్పందన వచ్చిందన్నారు. అధికారిక కార్యక్రమాల శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి స్వాగతం పలికారన్నారు. అభివృద్ధి తప్ప ఎలాంటి రాజకీయాలు చేయలేదన్నారు. ఈ పరిణామం జిల్లా అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఈ సభను జయప్రదం చేసిన ప్రతి ఒక్కరిని ధన్యవాదలు తెలిపారు. సమావేశంలో జెడ్పీ చైర్మెన్ జనార్దన్ రాథోడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నాయకులు ఉన్నారు.



కరాటేలో మస్కాపూర్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఖానాపూర్

ఐకా సంస్థ ద్వారా ఇటీవల నిర్వహించిన కరాటే పోటీల్లో మస్తాపూర్ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా మస్కాపూర్ ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థులు పడాల దీక్షితా, డి.అజయ్ కుమార్‌లను మంగళవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఇర్రి నరేందర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు బోనగిరి నరేందర్‌రావు, తొంటి శంకర్, కుర్ర శేఖర్, జాడి శ్రీనివాస్, వెన్నం అంజయ్య, కందూరి శ్రీనివాస్, గొల్లపెల్లి మారుతి, ఎంపీటీసీ స్వప్న, గంగాధర్, రమేష్‌లు అభినందించారు. వీరు సాధించిన విజయాన్ని స్ఫూర్తి పొంది విద్యార్థులందరూ ఆత్మరక్షణకు కరాటే విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు.